క్లుప్తంగా

ప్రారంభమైన శ్రీరంగనాథుడి పవిత్రోత్సవాలు



హనుమద్వాహనంపై శ్రీరంగనాథుడు

పులివెందుల టౌన్ : పట్టణ సమీపంలోని అతి పురాతన శ్రీరంగనాథస్వామి ఆలయంలో నూలుపూజ పవిత్రోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి రోజు శ్రీరంగనాథుడు సతీసమేతుడై హనుమంతుని వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు కృష్ణరాజేష్‌శర్మ శ్రీరంగనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాది వినాయక చవితి మరుసటి రోజు నుంచి 9రోజుల పాటు శ్రీరంగనాథుని ఆలయంలో నూలుపూజ పవిత్రోత్సవాలు వైభవంగా నిర్వహిస్తూ వస్తున్నారు. స్వామివారిని దర్శించుకొనేందుకు జిల్లా వ్యాప్తంగా భక్తులు తరలి వస్తారు. భక్తులకు ఆలయంలో ఎటువంటి సమస్యలు లేకుండా కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. పూజలో ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఈఓ రమణలు పాల్గొన్నారు.

పాదచారుల రైల్వేవంతెనను పొడిగించాలి

ఎర్రగుంట్ల : పట్టణంలోని రాణీవనం వాసులకు అనుకూలంగా రైల్వే ఫుట్ ఫ్లెట్‌ఫార్‌ను పొడిగించాలని రాణీవనం వాసులు, ఆర్య వైశ్య సభ్యులు ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డిని మంగళవారం నిడుజివ్వి గ్రామంలో కలసి విన్నవించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి సమస్యను పరిష్కరిస్తామని వారికి భరోసా ఇచ్చారు.

ఆర్టీసీని లాభాల బాటలోకి తెస్తాం

జమ్మలమడుగు : ఆర్టీసీ ఉద్యోగులందరూ కలిసికట్టుగా విధులను నిర్వహించి ఆర్టీసీ డిపోను లాభాల బాటలోకి తెస్తామని డిపో మేనేజర్ సీవీ ప్రవీన్ తెలిపారు. మంగళవారం స్థానిక డిపో ఆవరణలో ఆదర్శ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను ఆయన అందించి మాట్లాడారు. డిపో అభివృద్ధికి ఉద్యోగులే కీలకమన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి

ఎర్రగుంట్ల : పట్టణ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్‌లు పరిశీలించి మాట్లాడారు. స్థానిక 11వ వార్డులో రూ.7 లక్షలతో జరుగుతున్న సిమెంట్ రోడ్డు పనులను, అలాగే వలసపల్లి రోడ్డులో ఉన్న షాదిఖాన్‌కు రూ.5 లక్షలతో ప్రహరీ నిర్మిస్తున్న పనులను పరిశీలించారు. ఈ పనులను ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరు చేయించారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పెన్నారషీద్, నాగిరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు రషీద్, ఆర్‌ఓ గంగిరెడ్డిలు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'ను విజయవంతం చేయాలి

చెన్నూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంపై మండల అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మండల ప్రత్యేక అధికారి సీహెచ్ వెంకటసుబ్బయ్య పాల్గొని మాట్లాడారు. బుధవారం ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు జరగబోయే స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయరామరాజుతోపాటు 18 మంది జిల్లా ముఖ్య అధికారులు పాల్గొంటారని తెలిపారు. నేడు జరగబోయే స్పందన కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులతో పాటు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పఠాన్‌అలీఖాన్, ఎంపీడీవో సురేష్‌బాబు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సీఐకి సన్మానం



సీఐ వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న సిబ్బంది

వేంపల్లె : వేంపల్లెలో విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న సీఐ జి.వెంకటేశ్వర్లును ఎస్ఐ తిరుపాల్ నాయక్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ సన్మానించారు. పులివెందుల డీఎస్పీ కె.ఎస్.వినోద్‌కుమార్, సిబ్బంది ఆయనకు వీడ్కోలు పలికారు. విధినిర్వహణలో సీఐ తమ అనుభూతిని సిబ్బందితో పంచుకున్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ గోవిందరెడ్డి, సిబ్బంది, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా బృందం, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, ఏఎస్ఐ శ్రీనివాసమూర్తి, హెడ్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. అలాగే వేంపల్లెలో విధులు నిర్వర్తించి చక్రాయపేట పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయిన కానిస్టేబుల్ వలిని సన్మానించారు.

ఘనంగా వినాయక చవితి వేడుకలు

పులివెందుల రూరల్ : వినాయక చవితి పండుగను పురష్కరించుకుని పులివెందుల నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పులివెందుల పట్టణంలోని బ్రాహ్మణపల్లె రోడ్డులో కౌన్సిలర్ కోడి రమణ 16 అడుగుల వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లై డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డిలు పాల్గొన్నారు. . అలాగే మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె, కొత్తపల్లె, అచ్చవెల్లి, తుమ్మలపల్లె, కనంపల్లె, రాగిమానుపల్లె, తదితర గ్రామాల్లో వినాయక చవితి పండుగను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ హాఫీజ్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల టౌన్ : పట్టణంలో వినాయక చవితి పండుగను పురస్కరించుకుని పట్టణ ప్రజలు ఘనంగా చవితి వేడుకలు జరుపుకున్నారు. పట్టణంలోని అన్ని ప్రధాన కూడళ్లలో వాడవాడలా వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రజలు పూజలు జరుపుకున్నారు. వినాయక విగ్రహాల వద్ద అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక వినాయక స్వామి ఆలయంలో గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. వినాయక ఉత్సవాలలో భాగంగా మండపాల వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

కమలాపురం : వినాయక చవితి పర్వ దినాన్ని పురస్కరించుకుని గణనాథులు వాడ వాడలా కొలువు దీరారు. సోమవారం పట్టణంలోని క్రాస్‌రోడ్డు, గ్రామచావడి, శీలా వీధి, బ్రాహ్మణ వీధి, పక్కీరు వాడ, పాత కచ్చేరి వీధులతో పాటు మండలంలోని కె.అప్పాయపల్లె, చదిపిరాళ్ల, పెద్దచెప్పలి, చిన్నచెప్పలి, సి.రాజుపాళెం, నల్లింగాయపల్లె, పందిళ్లపల్లె, కోగటం, సంబటూరు, గంగవరం, దేవరాజుపల్లె తదితర గ్రామాల్లో వివిధ ఆకారాలతో గణనాధులు కొలువు దీరారు. భక్తులు పెద్ద సంఖ్యలో గణనాధులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ చావడి వద్ద భారీ గణనాధుని విగ్రహాన్ని కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల్లో పలు



పులివెందుల : ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తదితరులు

సాంస్కృతిక కార్యక్రమాలు, పూజలు నిర్వహించారు. అన్నదానాలు ఏర్పాటు చేశారు. భక్తులు పోటీ పడి వేలం పాటలో లడ్డులు దక్కించుకున్నారు. కొన్ని చోట్ల నిమజ్జనం నిర్వహించారు.

వీరపునాయునిపల్లె : వినాయకచవితి పండుగను పురష్కరించుకుని మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో 80 వినాయకుని ప్రతిమలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తున్నారు. ఆటల పోటీలు, డ్యాన్స్ పోటీలు ఏర్పాటు చేయగా పోటీల్లో చిన్నారులు, మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. వినాయకుని ప్రతిమల నిమజ్జన కార్యక్రమం బుధవారం ప్రారంభం కానుందని ఎస్ఐ కుల్లాయప్ప తెలిపారు. నిమజ్జన కార్యక్రమంలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా ఉండేందుకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

ముద్దనూరు : వినాయకచవితి పర్వదినం సందర్భంగా సోమవారం మండపాల్లో కొలువుదీరిన గణనాధ విగ్రహాలకు పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మండలంలో వినాయక విగ్రహాలను ఏర్పాటుచేశారు.

పెద్దముడియం : మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో 60 వినాయక ప్రతిమలను ఏర్పాటు చేశారు. బుధవారం రోజు విగ్రహాలను నిమజ్జనానికి తరలించనున్నారు. పెద్దపసుపుల గ్రామంలో 21 వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. గ్రామంలోని కోటవీధిలో 34వ గణపతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆటల పోటీలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

కొండాపురం : మండలంలోని గ్రామాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి వినాయక చవితి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దత్తాపురం పునరావాస కాలనీలో సి బ్లాక్‌లో ఏడు వేల నెమలి ఈకలతో 18 అడుగుల ఎత్తుతో ప్రత్యేకంగా విగ్రహాన్ని తయారు చేయించారు.

పెండ్లిమర్రి : మండలంలోని పలు గ్రామాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు ని ర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసుకుని పండుగను సంతోషంగా జరుపుకున్నారు.


వేముల : మండల వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. అన్ని గ్రామాల్లో వినాయకుని ప్రతిమలను ఏర్పాటు చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండుగ సందర్భంగా కోలాటం, చెక్కభజనలు ఆకట్టుకున్నాయి. కొన్నిచోట్ల మూడవ రోజు బుధవారం వినాయకుని నిమజ్జనానికి సర్వం సిద్ధం చేశారు.

సింహాద్రిపురం : మండల వ్యాప్తంగా సోమవారం భక్తిశ్రద్ధలతో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి పూజాకార్యక్రమాలతో పాటు మండపాల వద్ద అన్నదాన కార్యక్రమంతోపాటు భజన సాంస్కృతిక కార్యక్రమలు నిర్వహించారు. వేణుగోపాలస్వామి మండపం వద్ద గణపతి పూజా కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. సాసల చిన్నమ్మ అనే నాటక ప్రదర్శన నిర్వహించారు. ఎస్ఐ రోషన్ ఆధ్వర్యంలో పోలీసులు విగ్రహాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గట్టి చర్యలు చేపట్టారు. బుధవారం వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

జమ్మలమడుగు : పట్టణంలోని వాడ వాడల్లో వినాయకుడి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, టీకేఆర్ వీధిలో భారీగా సెట్టువేసి వినాయక విగ్రహాలను నిలబెట్టారు. విగ్రహ దాత వైఎస్సార్‌సీపీ నాయకుడు వి.హృషికేశవరెడ్డి ప్రత్యేక పూజలను నిర్వహించారు. విగ్రహాలను ఎవరు ఎప్పుడు నిమజ్జనం చేస్తారో ముందు పోలీసులకు తెలియజేస్తే నిమజ్జనానికి కావలసిన ఎర్పాటు చేస్తామని సీఐ సదాశివయ్య తెలిపారు. వినాయకుడి విగ్రహం చేతిలో భారీ సైజులో లడ్డులను ఏర్పాటు చేశారు. నిమజ్జనం రోజున వేలంపాట వేస్తామన్నారు.

వేంపల్లె : మండల వ్యాప్తంగా 350 వినాయక ప్రతిమలను ఏర్పాటు చేశారు. సోమవారం స్థానిక ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడికి వేంపల్లె జడ్పీటీసీ ఎం.రవికుమార్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీపీ లక్ష్మిగాయత్రిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల వినాయక చవితి పండుగను పురష్కరించుకుని పలు వీధుల్లో అన్నదాన వస్త్రధారణ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు ప్రతాప్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లింగాల : మండలంలో సోమవారం వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అన్ని గ్రామాల్లో బొజ్జగణపయ్య ప్రతిమలను నెలకొల్పి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఎగువలింగాల రామాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని వద్ద వైఎస్సార్‌సీపీ కడప పార్లమెంటరీ కన్వీనర్ సారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్ని గ్రామాల్లో అన్నదానాలు, ఆర్కెస్ట్రా, ఊరేగింపులకు ఏర్పాట్లను కమిటీ సభ్యులు సిద్ధం చేశారు.



వీరపునాయునిపల్లెలో పూజలందుకుంటున్న గణనాథుడు



ముద్దనూరులో కొలువుదీరిన గణనాథుడు



పెద్దముడియం : పెద్దపసుపుల కోటవీధిలోని ఏకదంతుడు



కొండాపురం : బొమ్మేపల్లె కాలనీలో నెమలి ఈకలతో కొలువు దీరిన వినాయకుడు



వేముల : గొందిపల్లెలో వినాయకుడు



జమ్మలమడుగు : టీకేఆర్ వీధిలో వెలసిన గణపతి



సింహాద్రిపురంలో వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



వేంపల్లెలో విగ్రహం వద్ద జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, తదితరులు



లింగాలలో బొజ్జగణపయ్యకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు

అందరికి అండగా జగనన్న ప్రభుత్వం

పులివెందుల టౌన్ : అందరికి అండగా జగనన్న ప్రభుత్వం నిలుస్తోందని, జగనన్న ప్రభుత్వంలోనే గడప గడపకు సంక్షేమ ఫలాలు అందాయని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక లయోలా డిగ్రీ కళాశాల రోడ్డు, ఆర్ఆర్ స్ట్రీట్, ఇస్లాంపురం, పలు ప్రాంతాల్లో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆదేశాల మేరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. జగనన్న ప్రభుత్వంలో జరిగిన మేలును, అందిన పథకాలను ప్రజలకు వివరించారు. ఇంకా ఎవరికైనా పథకాలు అందకపోతే తెలియజేయాలన్నారు. భవిష్యత్తులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలకు అండగా నిలిచి వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను అధికారుల ద్వారా వెంటనే పరిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హాఫీజ్, జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శశికాంత్‌రెడ్డి, సివిల్‌సప్లై రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, కౌన్సిలర్లు ఖాదర్‌బాషా, పార్నపల్లి కిశోర్, కోడి రమణ, జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి, కో ఆప్షన్ మెంబర్ దాసరి చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

ఒంటగారిపల్లెను ముంపు గ్రామంగా ప్రకటించండి

ముద్దనూరు : ఒంటగారిపల్లె గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాలని కోరుతూ మంగళవారం

ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి గ్రామస్తులతో కలసి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ విజయరామరాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వామికొండ రిజర్వాయర్ వల్ల నీళ్ల లీకేజీ అయి పొలాలలోకి రావడంవతో రైతులు పంటలు పండించుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని అలాగే గ్రామాలలోకి ఊట నీరు వచ్చి విష సర్పాలు వస్తున్నాయని ప్రజలు వాపోతున్నట్లు ఆయన తెలిపారు. గ్రామంలో సుమారు 40 కుటుంబాలు ఉన్నాయని ఇది ఎర్రగుంట్ల మండలానికి సుమారు 15 కిలో మీటర్ల దురంలో ఉందన్నారు. ఉద్యాన శాఖ రాష్ట్ర ప్రధాన సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, రైతులు చంద్రమోహన్‌రెడ్డి, రామాంజనేయరెడ్డి, సన్నారెడ్డి, ఈశ్వరరెడ్డి, రామకృష్ణారెడ్డి, చెన్నకేశవరెడ్డిలు పాల్గొన్నారు.



కలెక్టర్ విజయరామరాజుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

ముత్తుకూరు గ్రామసర్పంచ్‌గా గంగాదేవి

వేంపల్లె : మండలంలోని ముత్తుకూరు గ్రామ సర్పంచ్‌గా ఇందుకూరు గంగాదేవిని నియమించినట్లు మండల అభివృద్ధి అధికారి మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ విజయరామరాజు ఆదేశాల మేరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె నియామక పత్రాన్ని అందుకున్నారు. సర్పంచ్‌గా ఉన్న ఎం.కుమారి అనారోగ్య కారణంగా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఉపసర్పంచ్‌గా ఉన్న ఇందుకూరు గంగాదేవిని సర్పంచ్‌గా నియ మిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా గంగాదేవి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిల ఆశయాలకు అనుగుణంగా గ్రామపంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సర్పంచ్ నియామకానికి కృషిచేసిన జడ్పీటీసీ ఎం.రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబులరెడ్డిలకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



గంగాదేవికి నియామక పత్రాన్ని అందజేస్తున్న మండల అభివృద్ధి అధికారి మల్లికార్జున్‌రెడ్డి

డీసీసీబీలో ఈ–స్టాంప్‌ల విక్రయాలు

ప్రారంభించిన ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి

ప్రొద్దుటూరు : అవినీతికి తావు లేకుండా మెరుగైన పాలన అందించేందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా డీసీసీబీల్లో ఈ–స్టాంప్‌ల విక్రయాలను ప్రారంభించినట్లు ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి తెలిపారు. స్థానిక వైఎంఆర్ కాలనీలోని డీసీసీబీ బ్రాంచ్‌లో మంగళవారం ఆప్కాబ్ చైర్‌పర్సన్ ఈ–స్టాంప్ విక్రయాలను ఆన్‌లైన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్తుల అమ్మకాలు, కొనుగోలుకు సంబంధించి గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ విధానం అమలులోకి తెచ్చిందన్నారు. తమ శాఖలో ట్యాక్స్ కంప్యూటరైజేషన్ ఈ ఏడాది ఆఖరుకల్లా పూర్తవుతుందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా డీసీసీబీలన్నీ లాభాల బాటలోనే ఉన్నాయని, ముఖ్యమంత్రి సొసైటీలను గ్రామాల్లోని ఆర్‌బీకేలకు అనుసంధానం చేయాలనే ఆలోచనలో ఉన్నారన్నారు. తద్వారా రైతులకు సేవలు పూర్తి అందుబాటులో ఉంటాయన్నారు. కమర్షియల్‌బ్యాంకులకు దీటుగా సహకార బ్యాంకులు సేవలు అందిస్తున్నాయన్నారు. సొసైటీల ద్వారా పెట్రోలు, గ్యాస్ ఏజెన్సీలతోపాటు ఎరువుల దుకాణాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. తమ సంస్థ ప్రస్తుతం రూ.250 కోట్ల లాభాలతో ఉందని తెలిపారు. మాజీ వైస్ ఎంపీపీ మల్లేల రాజారామ్‌రెడ్డి, సహదేవరెడ్డి, బ్రాంచ్ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి మొబైల్ ఆధార్ క్యాంప్

కమలాపురం : మండలంలో ఈనెల 20వ తేదీ నుంచి మొబైల్ ఆధార్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 20, 21వ తేదీల్లో చిన్నచెప్పలి సచివాయలయంలో, 22, 23న ఎల్లారెడ్డిపల్లె సచివాలయంలో ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని ఆమె తెలిపారు. అలాగే 20వ తేదీ నుంచి 23వ తేదీ వరకు కోగటం సచివాలయంలో ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని, ఆధార్ అప్‌డేట్ చేసుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

తప్పులులేని ఓటరు జాబితా సిద్ధం చేస్తాం



మాట్లాడుతున్న ఈఆర్‌ఓ చంద్రమోహన్

కమలాపురం : అందరి సహకారంతో తప్పులులేని ఓటరు జాబితాను సిద్ధం చేస్తామని ఈఆర్‌ఓ చంద్రమోహన్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, అన్ని మండలాల తహసీల్దార్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇప్పటికే బీఎల్వోలు ఇంటింటికి తిరిగి ఓటరు జాబితా పరిశీలన సర్వే పూర్తి చేశారన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో తప్పులు లేని ఓటరు జాబితాను తయారు చేస్తామన్నారు. ముఖ్యంగా 18–21 ఏళ్ల మధ్యనున్న యువతీ యువకులు చాలా తక్కువ శాతం ఓటు నమోదు చేసుకున్నారని, వారిపై దృష్టి సారించి అర్హులైన వారందరికి ఓటు హక్కు కల్పించాలన్నారు. కార్యక్రమంలో అన్ని మండలాల తహసీల్దార్లు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఢిల్లీకి 'మేరా మట్టి మేరా దేశ్' కలశం



ఎంపీడీఓ భాగ్యలక్ష్మీకి కలశం అందజేస్తున్న సొసైటీ సభ్యులు

ఎర్రగుంట్ల : మండల పరిధి అన్ని గ్రామ పంచాయతీలలోని గ్రామాల నుంచి స్వీకరించిన మట్టి కలశాన్ని ఢిల్లీకి పంపినట్లు ఎంపీడీఓ భాగ్యలక్ష్మీ తెలిపారు. మంగళవారం ఈ మట్టి కలశాన్ని పీపుల్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రెసిడెంట్ చలమయ్య అందజేశారు. ఈ సందర్భంగా అన్ని గ్రామ పంచాయతీలలోని గ్రామాల నుంచి మట్టిని సేకరించి దాన్ని కలశంలో ఉంచి దాన్ని ఢిల్లీకి చేర్చడానికి ఎంపీడీఓకు అందజేశామన్నారు.

గడప గడపలో అపూర్వ ఆదరణ

వల్లూరు : మండలంలోని తప్పెట్ల గ్రామ సచివాలయ పరిధిలో మంగళవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, చింతకొమ్మదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులురెడ్డి, మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డిలకు స్థానిక నేతల ఆధ్వర్యంలో ప్రజలు భారీ గజ మాలతో స్వాగతం పలికారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాలను గురించి వివరించారు. అర్హత వుండి ఏవైనా పథకాలు అందకున్నా, ఏవైనా ఇతర సమస్యలు వున్నా తెలపండి వాటిని పరిష్కరిస్తామని వారు ప్రజలకు భరోసా ఇస్తూ వీలైన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నేతలు రఘునాథరెడ్డి, రవీంద్రారెడ్డి, రాజారెడ్డి, బాల మైసూరారెడ్డి, ముకుందారెడ్డి, సుబ్బిరెడ్డి, పుత్తా శ్రీనివాసులురెడ్డి, వెంకట్రామిరెడ్డి, సాయినాథరెడ్డి, మహేశ్వరరెడ్డి, పాల సుబ్బారెడ్డి, గోపాల్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, పుల్లారెడ్డి, హరియాదవ్, ఓవీ సుబ్బారెడ్డి, సతీష్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, ఎంపీడీవో జుబేద, తహసీల్దార్ శంకర్‌రావు, ఈవో పీఆర్‌డీ ప్రసాద్, ఎంఈవో లిల్లెమ్మ, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



తప్పెట్లలో రవీంద్రనాథరెడ్డి, మల్లికార్జునరెడ్డిలకు గజమాలతో స్వాగతం పలుకుతున్న స్థానిక నాయకులు

తప్పు చేస్తే శిక్ష ఎవరికైనా తప్పదు

పులివెందుల రూరల్ : తప్పు చేస్తే ఎటువంటి వారికైనా వయసుతో సంబంధం లేకుండా ఎంత పెద్ద వారికైనా శిక్ష తప్పదని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు శశికాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం పులివెందులలోని వైఎస్సార్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతిపక్షనాయకుడు చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేశారని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో తప్పు చేస్తే 72 సంవత్సరాలైనా, 100 సంవత్సరాల వారికైనా శిక్ష విధించడం జరుగుతుందన్నారు. మీరు నిజంగా తప్పు చేయనప్పుడు న్యాయంగా పోరాడి న్యాయంగా బయటికి రావాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అప్పట్లో 16 నెలలు జైలు శిక్ష వేస్తే ఎవరిపైన ఆరోపణలు చేయకుండా నేను ఏ తప్పు చేయలేదని న్యాయంగా పోరాడి బయటికి వచ్చి ప్రజల మన్ననలను పొంది అత్యధిక సీట్లు సాధించి రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యారన్నారు. వైఎస్ కుటుంబ సభ్యులు ఉన్నన్నాళ్లు పులివెందుల ప్రాంతంలో టీడీపీ నాయకుల ఆటలు సాగవన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అత్యాధునిక వసతులతో ఆసుపత్రి

నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రి (సామాజిక ఆరోగ్య కేంద్రం) అత్యాధునిక వసతులతో నిర్మాణం చేపట్టారు. రూ.8.5కోట్లతో 1.4 ఏకరాల్లో విశాలమైన గదులతో ఆసుపత్రిని నిర్మించారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి కమలాపురం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న దృఢ సంకల్పంతో నిధులు మంజూరు చేయించి కొత్త భవనం నిర్మించేలా చేశారు. కమలాపురం, వల్లూరు, ఖాజీపేట, చాపాడు మండలాలకు చెందిన రోగులు వైద్య సేవల కోసం నిత్యం ఈ ఆసుపత్రికి వస్తుంటారు. వైద్యులు కూడా అప్పటి పాత ఆసుపత్రి భవనంలో బిక్కు బిక్కు మంటూ వైద్య సేవలు నిర్వహించే వారు. వర్షాకాలంలో ఎటు చూసిన కారుతూ ఉండేది. ఈ విషయాలను దగ్గరగా చూసిన ఎమ్మెల్యే కొత్త భవనం నిర్మించాలని నిధులు విడుదల చేయించారు. అత్యాధునిక వసతులతో 30 పడకల ఆసుపత్రి భవనం నిర్మించారు. ఇందులో రెండు ఆపరేషన్ థియేటర్లు, గైనిక్, డెంటల్, జనరల్ వార్డులతో సహా 42 గదులు నిర్మించారు. మార్చురి గది అదనంగా నిర్మించారు. ఇందులో బ్లడ్ బ్యాంక్, ల్యాబ్ తదితర అన్ని డిపార్ట్‌మెంట్లు ఏర్పాటు కానున్నాయి.



కమలాపురంలో నూతనంగా నిర్మించిన 30 పడకల ఆసుపత్రి

అభ్యుదయ సాహితీవేత్త తాపీ ధర్మారావు

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో మంగళవారం ప్రసిద్ధ అభ్యుదయ సాహితీవేత్త, పాత్రికేయులు, హేతువాది తాపీ ధర్మారావు 137వ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది ముందుగా తాపీ ధర్మారావు చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ తాపీ ధర్మారావు గొప్ప అభ్యుదయ సాహితీవేత్త, పాత్రికేయుడు, హేతువాది, సంఘ సంస్కర్త అని అన్నారు. చేమకూర వేంకటకవి రచించిన 'విజయవిలాస' కావ్యానికి ఆయన రాసిన 'హృదయోల్లాస' వ్యాఖ్యకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించిందన్నారు. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి , లైబ్రరీ అసిస్టెంట్ హరిభూషణ రావు మాట్లాడారు. కార్యక్రమంలో బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.